# అమెరికా విక్రమార్కుడి అసలు రూపం

అమెరికా వెళ్ళి చదవటమన్నా, ఆపైన అక్కడ ఉద్యోగం చెయ్యటమన్నా జీవితం ధన్యమై పోయినట్లు లెక్క మన వాళ్ళకి. అమెరికా వెళ్ళడానికి పనికిరాని చదువు నిష్ప్రయోజనమూ, నిరర్థకమూ అని కూడా చాల మంది నమ్ముతారు. అందుకే ఏదో విధంగా అమెరికాలో అడుగుబెట్టి, అక్కడ ఏదో ఒక ఉద్యోగం సంపాదించడానికీ, వీలయితే అక్కడే స్థిర పడటానికీ శత విధాల ప్రయత్నిస్తూ వుంటారు మన వాళ్ళు. అమెరికా అంటే భూతల స్వర్గం అలాంటి వాళ్ళకి. అయిదారేళ్ళు అమెరికాలో వుండి వచ్చిన వాళ్ళంతా మన దేశం గురించీ, ఇక్కడి ప్రజల గురించీ, ఇక్కడి పరిస్థితుల గురించీ, ఇక్కడి నాగరికత గురించీ చాలా బాధపడ్తుంటారు; జాలిపడ్తుంటారు; కోప్పడుతూ వుంటారు; అసహ్యించుకుంటూ వుంటారు; అసలంత గొప్ప దేశం నించి ఎందుకూ పనికిరాని ఈ దేశానికెందుకొచ్చామా అని మధనపడ్తూ వుంటారు.

అలాంటి వాళ్ళందర్నీ వాళ్ళ మానాన వాళ్ళని వదిలేసినా, అమెరికాని ఒక గొప్ప దేశంగా, అభివృద్ధి విషయంలో ఆదర్శప్రాయమైన దేశంగా, పెట్టుబడిదారీ విధానాన్ని ఎంచుకున్న దేశాల్లో అగ్రతాంబూలం అందుకోదగిన దేశంగా చాల మంది భావిస్తారు. ఆ విధంగా ఒప్పుకోని వాళ్ళు కూడా, - అమెరికా గురించీ, అక్కడి పరిస్థితుల గురించీ, అక్కడి ఆచార వ్యవహారాల గురించీ, ముఖ్యంగా అక్కడి భారతీయుల సాంఘిక జీవితం గురించీ తెలుసుకోడానికి ఎంతో ఆసక్తి చూపుతూ వుంటారు. చదువు కోసమో, ఉద్యోగం కోసమో అమెరికా వెళ్ళే వారందరికీ ఇటువంటి విషయాలు తెలుసుకోవలసిన అవసరం కూడా ఎంతో వుంటుంది.

అలాంటి అవసరాన్ని తీరుస్తూ, అమెరికా గురించీ, అక్కడి వాళ్ళ గురించీ, అక్కడున్న మనవాళ్ళ గురించీ ఎన్నో ఆసక్తికరమైన విషయాలు అందంగా సాధికారంగా, సరసంగా, చమత్కారంగా - 'అమెరికా బేతాళుడి కథలు' అన్న పేరుతో చెప్పి, అందర్నీ ఆకర్షించిన అమెరికా విక్రమార్కుడు సత్యం మందపాటి అసలు రూపం ఏమిటో ఈ పుస్తకంలోని కథలు చెబుతాయి.

దాదాపు ముప్ఫయేళ్ళ నించీ కథలు రాస్తున్న సత్యం మందపాటి అమెరికా వెళ్ళకముందు - అంటే సుమారు పదిహేనేళ్ళ క్రితం రాసిన, అప్పట్లో అన్ని పత్రికల్లోనూ అచ్చయిన (వీటిలో ఒకటి రెండు కథలు మాత్రం ఈ మధ్యనే అచ్చయినాయి) కొన్ని మంచి కథలు ఎంచి, వాటిని రెండు సంపుటాలుగా తన 'వాహిని బుక్ ట్రస్ట్' ద్వారా ప్రచురించారు - 'రచన' శాయి. ఆ రెండు పుస్తకాల్లోనూ ఇదొకటి. సుమారు 150 కథలూ, కొన్ని నవలలూ, మరికొన్ని నాటికలూ నాటకాలూ కూడా రాసిన సత్యం మందపాటి ఈనాటి పాఠకులందరికీ తెలియకపోయినా, గత రెండు మూడు దశాబ్దాల్లో పత్రికాముఖంగా వెలువడిన సాహిత్యాన్ని పరిశీలనా దృష్టితో చూసిన వారందరికీ పరిచితులే. ముఖ్యంగా ఇటీవలి కాలంలో 'రచన' పత్రికలో ధారావాహికంగానూ, ఆ తర్వాత పుస్తక రూపంలోనూ వెలువడిన (ఇదీ 'వాహినీ బుక్ ట్రస్ట్' వారు ప్రచురించిందే) 'అమెరికా బేతాళుడి కథలు' అనేక మంది పాఠకుల్ని ఆకర్షించి, అలరించటమే కాక ప్రయోజనకరమైన కథలుగా ప్రసిద్ధిపొందాయి.

ఇంతటి అనుభవమూ, ఇంతటి ప్రసిద్ధీ గల ఈ రచయితకి ఇవ్వాళ ఎవరూ యోగ్యతా పత్రాలు ఇవ్వాల్సిన పని లేదు. ఆ పని చెయ్యాలన్న ఉద్దేశ్యం కూడా నాకు లేదు. ఒక రచయితగా, ఒక పాఠకుడిగా ఈ కథల్లోనూ నాక్కనిపించిన మంచి చెడ్డల గురించి నాలుగు మాటలు చెప్పడమే ఈ ముందు మాట ఉద్దేశ్యం.

ఈ కథల్లో నన్ను ప్రధానంగా ఆకర్షించింది - రచయిత నిజాయితీ; నిరాడంబరత. ఒకటి రెండు కథల్లో హాస్యోత్పత్తి కోసం చేసిన ప్రయత్నం (ఆ ప్రయత్నం కూడా సఫలమే) మినహా, మరెక్కడా కూడా ప్రయత్నపూర్వకంగా దిద్దిన మెరుగులూ, అద్దిన అలంకారాలూ ఈ కథల్లో కనిపించవు. వస్తువుకే తప్ప, రూపానికి అనవసరమైన

ప్రాధాన్యతం ఇచ్చినట్టు కనిపించదు. ఇక వస్తువు విషయానికొస్తే, - తనకి తెలిసిన, అందరికీ తెలిసిన విషయాలే చెప్పడం తప్ప, - అభూతకల్పనలకీ, అసహజ, అవాస్తవ చిత్రీకరణలకీ ఈ రచయిత ఎక్కడా పూనుకోలేదు. కథ చదువుతూ వుంటే ఆ కథే కనిపిస్తుంది గాని, రచయిత అనవసర జోక్యం ఎక్కడా కనిపించదు - చాల కథల్లో.

ఈ కథల్లో నన్నాకర్షించిన మరో మంచి విషయం - క్లుప్తత. ఈ కథల్లో చాల మటుకు చిన్న కథలు; కొన్ని మరీ చిన్న కథలు. అవసరమైతే తప్ప, కథ నిడివి పెరగకుండా అదుపులో వుంచగలగడమన్నది అందరు రచయితలకీ సాధ్యమయ్యే పని కాదు. చిన్న కథలు చిన్న కథలుగానే వుండటం ఈనాడు చాలా అవసరం.

ఈ దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత, వచ్చి చాలా ఏళ్ళు గడిచిన తర్వాత కూడా - ప్రజలు, ముఖ్యంగా సామాన్య ప్రజలింకా అధోగతిలోనే వున్నారనీ, పరిస్థితులింకా అధ్వాన్నంగానే వున్నాయనీ వాస్తవ దృష్టిలో పరిస్థితుల్ని అవగాహన చేసుకోగలిగిన వాళ్ళంతా అంగీకరిస్తారు. అటువంటి అవగాహన రచయితకి వున్నట్టూ, ఈ దేశంలో నిరుపేదలూ, నిర్భాగ్యులూ, నిరుద్యోగులూ నిత్యమూ చస్తూ బతికే నిస్సహాయ జీవితాల పట్ల ఆయనకెంతో ఆవేదన వున్నట్టూ, సానుభూతి వున్నట్లూ ఈ కథలు సాక్ష్యం పలుకుతాయి.

అర్థం పర్థం లేని ఆచారాలూ, అనర్థకమైన నమ్మకాలూ, నిరర్థకమైన సంప్రదాయాలూ, నిష్ప్రయోజనకరమైన నియమాలూ మామూలు మధ్య తరగతి జీవితాలని ఏ విధంగా పట్టి పీడిస్తాయో వివరించే కథలు కూడా ('రుక్మిణీ కళ్యాణం'; 'పున్నామ నరకం', 'కర్మభూమి', 'పసుపూ - కుంకుమా' వగైరా) ఈ పుస్తకంలో వున్నాయి. దుస్సంప్రదాయాల పట్లా, దురాచారాల పట్లా, మూఢనమ్మకాల పట్లా, మూర్ఖపు నియమాల పట్లా రచయితకి గల ఏవగింపూ, కోపమూ, అటువంటి వాటినన్నిటినీ వదిలించుకోడానికీ, ఎదిరించి ముందుకు సాగడానికీ ప్రయత్నించే ప్రత్యేకత గల పాత్రలూ ఈ కథల్లో మనకి కనిపిస్తాయి.

అవినీతికీ, ఆశ్రిత పక్షపాతానికీ, లంచగొండితనానికీ మారుపేరుగా మారిపోయిన ఉద్యోగులూ, స్వార్థం కోసం అటువంటి అవినీతిని ప్రోత్సహించి, తమకి అనుకూలంగా మార్చుకునే వ్యాపారులూ, నీతులు చెప్పడానికి తప్ప ఆచరించడానికి కాదనుకునే పెద్దమనుషులూ, కలల్లో బ్రతికే నిర్భాగ్యులూ, తమ బిడ్డని చదివించాలనుకునే కల ఎన్నటికీ నిజం కాదని తెలుసుకున్న నిరుపేదలూ, చావు బ్రతుకుల్లో వున్న బిడ్డని బ్రతికించుకోవడం కోసం ఆత్మ చంపుకుని, శరీరాన్ని అమ్ముకోడానికి సిద్ధపడి కూడా బిడ్డని దక్కించుకోలేకపోయిన తల్లులూ, కన్న కొడుకు ప్రాణం కంటే, కట్టుకున్న దాని మానం కంటే తన తాగుడే ముఖ్యమనుకునే తండ్రులూ, తాము తీసుకున్న గోతిలో తామే పడ్డ నాయకులూ, అధికారులూ, అన్ని విధాలా అన్యాయానికి గురై, ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చినపుడు కూడా మానవత్వం మర్చిపోలేని మనుషులూ - ఇలా ఎన్నో పాత్రలు సజీవంగా ఈ కథల్లో సాక్షాత్కరిస్తాయి.

మనం బ్రతికే సమాజం పట్లా, మన చుట్టూ వున్న పరిస్థితుల పట్లా, ఎంతో కొంత అవగాహన కలిగించి, అంతో యింతో మంచికి దోహదం చేసే విషయాలు చెప్పాలన్న సదాశయంతో, చిత్తశుద్ధితో రాసిన కథలు ఇవన్నీ. వీటిలో కొన్ని మామూలు కథలున్నాయి; కొన్ని మర్చిపోతగ్గ కథలున్నాయి; అయితే - చాలా మటుకు మంచి కథలున్నాయనే మాట మాత్రం అక్షరాలా సత్యం. ఈ సత్యాన్ని తన రచనల ద్వారా ఎప్పుడో నిరూపించుకున్న రచయిత సత్యం మందపాటి.

సత్యం కంటే అసత్యానికి, సహజం కంటే అసహజానికీ, వాస్తవం కంటే అవాస్తవానికీ, మంచి కంటే చెడుకీ పెద్ద పీట వేసి, ధనార్జన ఒక్కటే నిలకడ గలిగిన సత్యమని నిరూపించడానికి మన పత్రికలూ, టీవీలూ, సినిమాలూ నిరంతరమూ ప్రయత్నిస్తున్న ఈ రోజుల్లో - పాఠకులకి మంచి 'రచన'లందించాలన్న పట్టు వదలని విక్రమార్కుడు శాయి - ఈ అమెరికా విక్రమార్కుడు సత్యం మందపాటి అసలు రూపాన్ని బయటపెట్టి రచయితగా ఆయన సత్తా ఏమిటో ప్రకటించే ఈ కథలన్నింటినీ ఈ విధంగా పుస్తక రూపంలో ప్రకటించడం - మంచి కథలు చదవాలనే అభిరుచిగలవారంతా అభినందించదగిన విషయం.

హైదరాబాద్.
5, నవంబర్, 96.

– డి.వెంకట్రామయ్య